www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం 10-6-2024
Kurnool | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | కర్నూలు

వైసీపీ నాయకుడా మజాకా

- రామాలయం భూమిలో బోరు
- పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సర్పంచ్

రుద్రవరం, జూన్ 9: మండలంలోని టి.లింగందిన్నె గ్రామంలో ఓ వైసీపీ నాయకుడు రామాలయం భూమిలో బోరు వేశారు. సుమారు ఐదు రోజుల క్రితం గుట్టుచప్పుడు కాకుండా బోరు వేసి రెండు రోజుల క్రితం మోటారు ఏర్పాటు చేశాడు. సమీపంలో ఉన్న తన పొలంలోకి నీరు సరఫరా చేసేందుకు పైపులైను వేసే ప్రయత్నం ప్రారంభించాడు. గ్రామస్థులకు విషయం తెలియడంతో అభ్యంతరం తెలిపారు. వైసీపీ నాయకుడు వేసిన బోరును గ్రామ కమిటీ పరిశీలించిన అనంతరం గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి రుద్రవరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.


దేవాలయ భూమిలో వైసీపీ నాయకుడు వేసిన బోరు

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటారు

- ఆలిండియా స్థాయిలో 3,8వ ర్యాంకులు
- ప్రతిభ కనబరిచిన మరికొంత మంది విద్యార్థులు


తేజేశ్వర్


హరినాథ్


మాల్య హాసిని

కర్నూలు ఎడ్యుకేషన్/గోస్పాడు/ఎమ్మిగనూరు, జూన్ 9: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యార్థులు ఆలిండియా స్థాయిలో సత్తా చాటారు. నంద్యాల జిల్లా గోస్పాడు మండల కేంద్రానికి చెందిన బి.సందేశ్ ఆలిండియా స్థాయిలో 3వ ర్యాంక్ సాధించి సత్తా చాటారు. ఆలిండియా ఓపెన్ క్యాటగిరిలో 338 మార్కులతో 99.99 పర్సంటైల్‌తో మూడో ర్యాంకు సాధించారు. కర్నూలు నగరానికి చెందిన విద్యార్థి కొండూరు తేజేశ్వర్ జేఈఈ-అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్షలో 331/360 మార్కులు సాధించి ఆలిండియా స్థాయిలో 8వ ర్యాంకు సాధించారు. అలాగే కే.హర్షవర్ధన్ 42వ ర్యాంకు, కే.శివనారాయణ 51వ ర్యాంకు, ప్రణతి 345వ ర్యాంకులను సాధించారు. చిన్నటేకూరులోని డా.బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల ఐఐటీ-మెడికల్ అకాడమికి చెందిన సంతోష్ ఆలిండియా కేటగిరి స్థాయిలో 817, కే.అనిల్ నాయక్ 1032, ఎరుకుల రాజు 1529 ర్యాంకు, ఎం.అభిషేక్ 1783, జి.గణేష్ 1836, మోహన్ కుమార్ 2543, ఆర్.వికాస్ రాజ్ 2971, రత్న చంద్ర 3223, రఘు 3240, ఏ.రాజశేఖర్ 3709 ర్యాంకులు సాధించారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా గురుకుల విద్యార్థులు ప్రతిభను కనబరిచినట్లు అకాడమి డైరెక్టర్ రామసుబ్బారెడ్డి తెలిపారు.

- నంద్యాల జిల్లా గోస్పాడు మండలం నెహ్రూనగర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు బొగ్గులపల్లె రామసుబ్బారెడ్డి, రాజేశ్వరి దంపతుల కుమారుడు బి.సందేష్ పాఠశాల దశ నుంచే ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ వచ్చారు. పదో తరగతిలో 10కి 10 పాయింట్లు, ఇంటర్మీడియట్‌లో 957 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా బి.సందేశ్ మాట్లాడుతూ ఉత్తమ విద్యా సంస్థలో చేరుతానన్నారు. సివిల్స్ రాసి ఐఏఎస్ కావడం తన ఆశయమని తెలిపారు.

- జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో కర్నూలుకు చెందిన కొండూరు తేజేశ్వర్ 331/360 మార్కులు సాధించి ఆలిండియా కేటగిరి స్థాయిలో 8వ ర్యాంకు సాధించారు. తేజేశ్వర్ తల్లిదండ్రులు ఇద్దరూ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. తండ్రి శేఖర్ ఆస్పరి మండలం చిన్నహాల్తిలో స్కూల్ అసిస్టెంట్‌గానూ, కృష్ణవేణి జూపాడుబంగ్లా మండలం తంగడంచలో పాఠశాలలో ఎస్‌జీటీగా పని చేస్తున్నారు. విజయవాడ నుంచి ఫిడ్జ్ విద్యాసంస్థలో 6 నుంచి ఇంటర్ వరకు విద్యనభ్యసించారు. పదవ తరగతిలో 570 మార్కులు, ఇంటర్‌లో 981 మార్కులు సాధించారు. జేఈఈ-మెయిన్స్‌లో 331 మార్కులతో 99.918 పర్సంటైల్‌ను సాధించారు. ఈ సందర్భంగా తేజేశ్వర్ మాట్లాడుతూ ఐఐటీ ముంబై విద్యా సంస్థలో సీఎస్ఈలో చేరాలన్నదే తన లక్ష్యమని తెలిపారు.


సందేష్‌ను అభినందిస్తున్న తల్లిదండ్రులు

- జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాల్లో ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన హరినాథ్ ఆలిండియా స్థాయిలో ఓవరాల్‌గా 401వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 60వ ర్యాంకు సాధించారు. పట్టణంలోని మునెప్పనగర్‌లో నివాసం ఉంటున్న ఉపాధ్యాయ దంపతులు మల్లికార్జున, కృష్ణవేణిల కుమారుడు ఆర్.హరినాథ్ జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచారు. హరినాథ్ 6వ తరగతి వరకు ఎమ్మిగనూరు పట్టణంలో చదవగా, 7వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విజయవాడలోని ఓ ప్రైవేటు కళాశాలల్లో చదివారు. జేఈఈ అడ్వాన్స్ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరినాథ్ మాట్లాడుతూ సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని తెలిపారు.

- కర్నూలు నగరానికి చెందిన మాల్య హాసిని ఆలిండియా స్థాయిలో ఎస్టీ విభాగంలో 105వ ర్యాంకు సాధించి సత్తా చాటింది. కర్నూలు సర్వజన వైద్యశాలలో ఫార్మసిస్టుగా పని చేస్తున్న రాజేశ్ నాయక్ కుమార్తె మాల్య హాసిని 231/360 మార్కులు సాధించి ఎస్టీ విభాగంలో జాతీయ స్థాయిలో 105వ ఉత్తమ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం శ్రమించడం వల్లే జేఈఈ-మెయిన్స్, అడ్వాన్స్‌డ్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించడానికి దోహదపడిందన్నారు. మద్రాసు ఐఐటీలో చేరాలని ఉందన్నారు. అనంతరం సివిల్స్ రాసి పేదలకు సేవా చేయాలన్నదే తన లక్ష్యమని తెలిపారు.

టీడీపీ కార్యకర్త దారుణ హత్య

- బొమ్మిరెడ్డిపల్లెలో వేటకొడవళ్లతో వైసీపీ కార్యకర్తల దాడి
- సంఘటనా ప్రాంతంలోనే మృతి చెందిన గిరినాథ్ చౌదరి
- తీవ్ర గాయాలతో బయటపడిన మృతుని తమ్ముడు కళ్యాణ చక్రవర్తి
- మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, ఆమె కుమారుడు రామ్మోహన్‌పై ఫిర్యాదు
- సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్పీ జి.కృష్ణకాంత్


గిరినాథ్ చౌదరి(ఫైల్)

వెల్దుర్తి/పత్తికొండ, జూన్ 9: టీడీపీ కార్యకర్తను వైసీపీ కార్యకర్తలు వేటకొడవళ్లతో దారుణంగా నరికి చంపారు. మృతుని తమ్ముడు తీవ్ర గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. పత్తికొండ నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లెలో ఆదివారం సాయంత్రం ఈ సంఘటన చోటు చేసుకుంది. వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లెకు చెందిన మోదుపల్లి రామాంజనేయులు కుమారులు గిరినాథ్ చౌదరి (33), కళ్యాణ్ చక్రవర్తిలు గ్రామంలో నడుచుకుంటూ ఎస్సీ కాలనీ వైపు వెళ్తున్నారు. అదే సమయంలో అక్కడే ఉన్న వైసీపీ కార్యకర్తలు వీరితో గొడవకు దిగారు. టీడీపీ గెలిస్తే ఏం చేయగలరంటూ వాదనకు దిగారు. వారితో మాట్లాడుతూనే పక్కనే పొలంలో గడ్డివాము వద్ద ఉన్న వేటకొడవళ్లతో గిరినాథ్ చౌదరి, కళ్యాణ్ చక్రవర్తిలపై దాడికి దిగారు. గిరినాథ్ చౌదరి తలపై వేటకొడవళ్ల వేటు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్యాణ చక్రవర్తి తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కర్నూలుకు తరలించారు.

గ్రామంలో బలమైన వర్గం ఆ కుటుంబం: గ్రామానికి చెందిన మోదుపల్లి రామాంజనేయులు, టీడీపీ జిల్లా కార్యదర్శి మోదుపల్లి సుబ్బరాయుడు (టీడీపీ మాజీ కన్వీనర్) అన్నదమ్ములు. సుబ్బరాయుడు ప్రస్తుతం జిల్లా కార్యదర్శిగా పని చేస్తున్నారు. సుబ్బరాయుడు భార్య శైలజ గతంలో ఎంపీపీగా పని చేశారు. గ్రామంలో టీడీపీకి బలమైన వర్గంగా ఉంటూ పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వైసీపీకి దీటుగా టీడీపీని నడిపిస్తుండటమే విభేదాలకు కారణమని గ్రామస్థులు చెబుతున్నారు.

పోలింగ్ రోజు మొదలైన గొడవ: మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల రోజు గ్రామంలో పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ వర్గీయులు టీడీపీ వర్గీయులతో ఘర్షణకు దిగారు. అయితే ఎన్నికల సమయంలో గొడవలు ఎందుకని టీడీపీ వర్గీయులపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేయలేదు. ఎన్నికల ఫలితాల రోజు టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో సంబరాలు చేసుకుంటుండగా వైసీపీ వర్గీయులు వారితో గొడవ పెట్టుకున్నారు. టీడీపీ గెలిస్తే 'మీరు మమ్మల్ని ఏమైనా చేయగలరా' అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఒకరిద్దరు వైసీపీ కార్యకర్తలకు గాయాలు కూడా అయ్యాయి. అయితే.. దీంతో ప్రతీకారం తీర్చుకోవడం ఖాయమంటూ వైసీపీ వర్గీయులు తొడలు కొట్టి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆదివారం రోడ్డుపై వెళ్తున్న గిరినాథ్, కళ్యాణ్‌లపై వైసీపీ వర్గీయులు వేటకొడవళ్లతో దాడికి తెగబడ్డారు. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన పామయ్య, రమేష్, ప్రదీప్‌లతోపాటు మరో పది మంది కలిసి వీరిద్దరిపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు అక్కడకు చేరుకునేలోపే నిందితులు పరారయ్యారు.


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జి.కృష్ణకాంత్


హత్యకు గురైన గిరినాథ్ చౌదరి


చికిత్స పొందుతున్న కళ్యాణ చక్రవర్తి

సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్పీ: టీడీపీ కార్యకర్త దారుణ హత్య విషయం తెలుసుకున్న ఎస్పీ బొమ్మిరెడ్డిపల్లెకు చేరుకుని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు చోటు చేసుకోకుండా గట్టి చర్యలు తీసుకోవాలని సీఐ సురేష్ కుమార్, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డిలకు ఆదేశాలు జారీ చేశారు.

ఆసుపత్రికి చేరుకున్న టీడీపీ వర్గీయులు: వైసీపీ కార్యకర్తల చేతుల్లో హత్యకు గురైన గిరినాథ్ చౌదరి మృతదేహాన్ని పోలీసులు వెల్దుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించా రు. హత్య విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు, కార్య కర్తలు వందలాదిగా వెల్దుర్తి ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. దీంతో ఆసుపత్రి ప్రాంతం వద్ద పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. గిరినాథ్ చౌదరి హత్యకు సంబంధించి నిందితులతోపాటు మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, ఆమె కుమారుడు రామ్మోహన్‌రెడ్డి, గ్రామ నాయకుడు మధుసూదన్ రెడ్డిపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఓటమిని జీర్ణించుకోలేకే..: ఓటమిని జీర్ణించుకోలేక వైసీపీ నాయకులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తా

- కార్యకర్తల కష్టాన్ని ఎప్పటికీ మరువను
- వర్ధన్ బ్యాంకు అక్రమార్కుల్లో శిల్పాను వదిలే ప్రసక్తే లేదు
- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి


మాట్లాడుతున్న శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి


అభిమానులు బహూకరించిన ఖడ్గాన్ని చూపుతున్న బుడ్డా


సభకు హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

ఆత్మకూరు, జూన్ 9: శ్రీశైలం నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తానని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన శ్రీశైలం అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన బుడ్డా రాజశేఖరరెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో ఆదివారం ఆత్మకూరులో విజయోత్సవ సభను నిర్వహించారు. ముందుగా నంద్యాల టర్నింగ్ నుంచి గౌడ్‌సెంటర్ వరకు రోడ్‌షో నిర్వహించారు. అక్కడ దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే టీడీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో తనను గెలిపించిన నాయకులు, కార్యకర్తల కష్టాన్ని ఎప్పటికీ మరువనని అన్నారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా అనేక ప్రలోభాలకు గురిచేసినప్పటికీ అభిమానంతో తనపై ఆదరణ చూపించిన వారందరినీ గుండెల్లో పెట్టుకుంటానని అన్నారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఐదేళ్ల దుర్మార్గ పాలనతో అడ్రస్ గల్లంతైందని అన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా ఎంతో బాధ్యతగా పాలన అందిస్తానని చెప్పారు. కార్యకర్తలు కూడా ప్రజలతో మరింత చేరువై ఎప్పటికప్పుడు వారి సమస్యలపై స్పందించాలని సూచించారు. తనకు మెజార్టీ వచ్చినా, రాకపోయినా కార్యకర్తలందరినీ సమానంగా చూస్తానని తెలిపారు. అదేవిధంగా తనకు మెజార్టీ రానీ బూత్‌ల్లో పర్యటించి పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు. ప్రత్యేకించి యువతకు ఉద్యోగ కల్పనకు పాటుపడుతానని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి రైతు పొలానికి సాగునీరందించేలా చొరవ తీసుకుంటానని వివరించారు. ఇకపోతే ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్న వైసీపీ అరాచకాలు, దౌర్జన్యాలు, అక్రమాలతోనే పాలన సాగించారని, అందుకే ఎన్నికల్లో ఘోర ఓటమిని చవిచూశారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అన్నివిధాలుగా నాశనం చేశారని ఈ పరిస్థితుల్లో మోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌తోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని శ్రీశైలం నియోజకవర్గంలో అత్యుత్సాహం చూపిన వైసీపీ నాయకులను వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. వర్ధన్ బ్యాంకు పేరిట మాజీ ఎమ్మెల్యే శిల్పా రూ.30 కోట్లను కొల్లకొట్టారని, బాధితులు ముందుకొస్తే ఆయన్ని జైల్లో వేయిస్తానని స్పష్టం చేశారు. 50వేల మెజార్టీ రాకపోతే రాజకీయ సన్యాసం చేస్తానని ప్రగల్భాలు పలికిన ఎన్నికల్లో ఓడిపోగానే ఊరు విడిచి వెళ్లారని, ఇలాంటి నాయకులను ఇక్కడి ప్రజలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి, టీడీపీ సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, మహానంది ఎంపీపీ యశస్విని, జనసేన నాయకులు అశోక్, శ్రీరాములు, బీజేపీ నాయకులు వెంకటసుబ్బారెడ్డి, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

వడ్డెమానులో బోరు ప్రారంభం


వడ్డెమానులో బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, జూన్ 9: నందికొట్కూరు మండలంలోని వడ్డెమాను గ్రామంలో మారెమ్మ గుడివద్ద మంచినీటి సౌకర్యం కోసం ఆదివారం ఎమ్మెల్యే జయసూర్య కొత్తగా బోరును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు తనవంతుగా కృషి చేస్తానన్నారు. అందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథరెడ్డి, గ్రామ నాయకులు సత్యనారాయణరెడ్డి, నాగేశ్వరెడ్డి, తలారి వెంకటరాముడు, దిలీప్‌కుమార్‌నాయుడు, విజయుడు, నవీన్‌రెడ్డి, వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్యులకు అవగాహన


అవగాహన సదస్సులో పాల్గొన్న దంత వైద్యులు

నంద్యాల కల్చరల్, జూన్ 9: ఇండియన్ మెడికల్ అసోషియేషన్ రాయలసీమ బ్రాంచి 40వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నంద్యాలలో సిబిసిటి టెక్నాలజీపై దంత వైద్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా టెక్నాలజీ వల్ల దవడ ఎముకలను సూక్ష్మంగా పరిశీలించుటకు, ఇంప్లాంట్ చికిత్సలను, రూట్‌కెనాల్ చికిత్సలను సమర్థవంతంగా నిర్వహించుటకు, నోటి కేన్సర్, కంతులను గుర్తించుట గురించి డాక్టర్ ఉపేంద్రనాథ్‌రెడ్డితో అవగాహన కల్పించారు. త్రీడైమెన్షన్ ఆధునిక టెక్నాలజీ వల్ల దంత సమస్యలను కచ్చితమైన నిర్ధారణతో కనుగొని చికిత్సను అత్యుత్తమంగా, సమర్థవంతంగా చేయవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో నంద్యాల దంతవైద్యులు డాక్టర్ కిషోర్‌కుమార్, డా.ధనుంజయ, డా.బీవీ సుబ్బారెడ్డి, డా.మురళీధర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, కర్నూలు దంత వైద్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం


పండ్లు పంపిణీ చేస్తున్న ఎస్టీయూ నాయకులు

నంద్యాల (నూనెపల్లె), జూన్ 9: ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నంద్యాలలోని ఆసంఘం కార్యాలయ ఆవరణంలో ఘనంగా నిర్వహించారు. సంఘ రూపకర్తలు మొయినుద్దీన్, వీణా విజయ రామ రాజు, రాఘవాచారి, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాలులు అర్పించారు. వారు చేసిన సేవలను కొనియాడారు. ఎస్టీయూ జెండాను ఎగుర వేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణి చేశారు. ఎస్టీయూ రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, సుబ్బరాయుడు, నాగేంద్ర కుమార్, జిల్లా నాయకులు మౌలాలి, అజాంబేగ్, వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


విద్యార్థులకు మెమెంటోలు అందించిన కురువ సంఘం నాయకులు

నంద్యాల కల్చరల్, జూన్ 9: నంద్యాల పట్టణ కురువ సంఘం ఆధ్వర్యంలో పది, ఇంటర్ నందు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ఆదివారం అందజేశారు. నంద్యాల కురువ సంఘం అధ్యక్షులు క్రైప విజయ్‌కిరణ్ ఆధ్వర్యంలో పది, ఇంటర్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటో ఇచ్చి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి కల్లె విజయకుమార్, గౌరవ సలహాదారులు క్రైప హరినాథ్ బాబు, గౌరవ అధ్యక్షుడు కత్తి శంకర్, సంకల శ్రీరాములు, కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సుంకులా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం


చండీయాగంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరురూరల్, జూన్ 9: మండలంలోని కరివేన గ్రామంలో వెలసిన సుంకులా పరమేశ్వరి ఆలయంలో ఆలయ 11వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఆలయ కమిటి నిర్వాహకుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం సుంకులా పరమేశ్వరి అమ్మవారికి 9 కళశాలతో అభిషేకాది క్రతువులు నిర్వహించి ప్రత్యేక అలంకరణ గావించి, గణపతి పూజ, పుణ్యాహవచనం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో వేదపండితులు మహేష్ శర్మ, రామకృష్ణ శర్మ పర్యవేక్షణలో దంపతుల ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం చండీ హోమం, గణపతి హోమం, రుద్రహోమాలను నిర్వహించారు. అనంతరం మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి నిర్వహించే ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.అలాగే సోమవారం గ్రామంలోని మహిళల ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలను సమర్పించేందుకు గ్రామంలో బోనాల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.మధ్యాహ్నం విచ్చేసిన భక్తాదులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

టీడీపీ విజయోత్సవాలు

బండిఆత్మకూరు, జూన్ 9: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం, ఎమ్మెల్యేగా బుడ్డా రాజశేఖరరెడ్డి గెలవడంతో చెంచులు ఆనందం వ్యక్తం చేశారు. మండలంలోని నెమిళ్ళకుంట చెంచు గూడెంలో ఆదివారం జీసీ పాలెం గ్రామ ఉపసర్పంచ్ కంచర్ల చిన్న లింగారెడ్డి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ నాటక్క కేక్ కట్ చేశారు. అనంతరం అడవి బిడ్డలకు కేక్ పంచిపెట్టారు. టీడీపీ గెలుపు ప్రస్తుత సమయంలో ఎంతో అవసరమని, గ్రామాలు, పేదల అభివృద్ధి ఒక్క టీడీపీకే సొంతమని లింగారెడ్డి అన్నారు.

పాణ్యం: టీడీపీ గెలుపు నేపథ్యంలో కార్యకర్తలు మొక్కుబడి చెల్లించుకున్నారు. మండలంలోని కొండజూటూరులో ఆదివారం టీడీపీ కార్యకర్తలు గ్రామంలోని గంగమ్మ ఆలయం వద్ద 101 టెంకాయలు కొట్టి తమ మ మొక్కుబడిని చెల్లించుకున్నారు. గౌరు చరిత గెలవడంతో గంగమ్మ దేవతకు కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సిద్దం బాల గంగన్న, కేశవ, సుబ్బరాయుడు, పుల్లయ్య, సురేంద్ర, రామయ్య, ఈశ్వరయ్య, ఎల్లాసుబ్బయ్య, భాస్కర్, పుల్లయ్య, ఇసాక్, భోగేసుడు, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: శ్రీశైలం నియోజక వర్గంలో 20 సంవత్సరాల నుంచి టీడీపీ పార్టీ జెండా ఎగుర లేదు. 2024లో బుడ్డా రాజశేఖరరెడ్డి శ్రీశైలం నియోజక వర్గంలో బుడ్డా రాజశేఖరరెడ్డి గెలిచి టీడీపీ జెండాను ఎగుర వేశారు. టీడీపీ నాయకుడు టాప్ అయ్యుబ్ స్థానిక మస్తాన్ వలి దర్గాలో గుండు చేయించుకుని తన మొక్కుబడి చెల్లించుకున్నారు.


కొండజూటూరులో మొక్కుబడి చెల్లించుకుంటున్న కార్యకర్తలు


నెమిళ్ళకుంట గూడెంలో కేక్ కట్ చేస్తున్న చెంచులు

ఆత్మకూరుకు తరలిన నాయకులు


ఆత్మకూరుకు తరలివెళ్తున్న టీడీపీ నాయకులు

వెలుగోడు, జూన్ 9: సార్వత్రిక ఎన్నికల్లో శ్రీశైలం ఎమ్మెల్యేగా బుడ్డారాజశేఖరరెడ్డి విజయం సాధించి ఆత్మకూరులో ఆదివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి బుడ్డా సొంత మండలమైన వెలుగోడు నుంచి టీడీపీ నాయకులు కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఈసందర్భంగా తమ నేత నిర్వహించే ర్యాలికి అభిమానంతో తరలి వెళుతున్నామని టీడీపీ నాయకులు కార్యకర్తలు తెలిపారు.

వెలుగోడులో బీజేపీ సంబరాలు


వెలుగోడులో బాణసంచా కాల్చుతున్న బీజేపీ నాయకులు

వెలుగోడు, జూన్ 9: ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా ఆదివారం రాత్రి ప్రమాణ స్వీకారం చేశారు. దీన్ని పురస్కరించుకుని వెలుగోడు మండల బీజేపీ నాయకులు ప్రధాన సెంటరులో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం మిఠాయిలు పంచి పెట్టారు. వారు మాట్లాడుతూ మూడోసారి దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ప్రధాని మోదీ ఆధ్వర్యంలో భారత దేశాన్ని అగ్రస్థానంలో నిలుపుతారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రతాప్ ఆచారి, రాజశేఖరరెడ్డి, నాగేశ్వరరావు, నాయక్, తదితరులుపాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'


ఎమ్మెల్యే ఫరూక్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

గోస్పాడు, జూన్ 9: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్‌టీయూ నాయకులు భాస్కర్‌రెడ్డి, విజయరావు, రామ్‌పక్కీర్‌రెడ్డి ఎన్ఎండీ ఫరూక్‌ను కోరారు. ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో టీడీపీ తరుపున గెలుపొందిన ఎన్ఎండీ ఫరూక్‌ను ఆదివారం నంద్యాల టీడీపీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకుడు రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల (నూనెపల్లె): నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల, పెన్షనర్లలపై సానుకూల వైఖరిని అవలంబించి ఉద్యోగులసమస్యల్ని తీర్చాలని ఏపీఎన్జీవోస్ అసోషియేషన్ రాష్ట్ర సహాధ్యక్షుడు దస్తగిరి రెడ్డి కోరారు. నంద్యాల ఎమ్మెల్యేగా ఎన్నికైన ఎన్ఎండీ ఫరూక్‌ను ఆదివారం టీడీపీ కార్యాలయంలో అసోషియేషన్ నాయకులు, ఉద్యోగులు మర్యాద


ఎమ్మెల్యే ఫరూక్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మణి శేఖరరెడ్డి, హుసేన్ రెడ్డి, నర్సారెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

- నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఫరూక్‌ను ఘనంగా సన్మానించారు. ఆదివారం ఆసంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రమణయ్య, లీగల్ అడ్వైజర్ రామచంద్రారావు, గౌరవ సలహాదారుడు ఏవీఆర్ ప్రసాద్ తదితరులు ఫరూక్‌ను కలిసి సన్మానించారు. కూటమి మెనిఫెస్టోలో ఉన్న దివ్యాంగుల పెన్షన్ పెంపుతో మద్దతు తెలిపి గెలిపించారని డాక్టర్ రవికృష్ణ అన్నారు. దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని వారు కోరారు.
- డిజేబుల్డ్ రైట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులు ఆదివారం ఎమ్మెల్యే ఫరూక్‌ను ఘనంగా సన్మానించారు. ఆయన గెలుపుకు విశేషంగా కృషి చేసిన ఎన్ఎండీ ఫిరోజ్‌ను అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మస్తాన్ వలి తదితరులు సన్మానించారు.

'రైతులను గాలికొదిలేసిన అధికారులు'


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మిడుతూరు, జూన్ 9: మొక్కజొన్న, పత్తి విత్తనాలు ఇవ్వకుండా వ్యవసాయాధికారులు రైతులను గాలికి వదిలేశారని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు పిక్కిలి వెంకటేశ్వర్లు అన్నారు. మిడుతూరులో రైతు సంఘం నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ సమయానికి మండలంలో వర్షాలు కురియడం వల్ల రైతులు పొలాల్లో మొక్కజొన్న, పత్తి విత్తనాలు ఎక్కువగా నాటేందుకు ముందుకు వస్తున్నారన్నారు. వ్యవసాయ అధికారులు మాత్రం రైతులకు కావాల్సిన మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఎక్కువగా మొక్కజొన్న, పత్తి, మినుము, మిరప, ఉల్లి పంటలు సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ప్రజాప్రతినిధులు ఎన్నికల హడావిడిలో ఉండగా వ్యవసాయ అధికారులు మాత్రం మిడుతూరు మండలంలో రైతులకు ఖరీఫ్‌లో అవసరం లేని విత్తనాలు వరి, జీలుగలు, జొన్నలు, రైతులకు అందిస్తూ చేతులు దులుపుకోవడం సరికాదని అన్నారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు స్పందించి మండలంలోని రైతులకు వ్యవసాయ కార్యాలయాల్లో మొక్కజొన్నలు, పత్తి విత్తనాలు అందిచేలా చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వర్లు డిమాండు చేశారు. రైతు సంఘం నాయకులు సామన్న, తిరుపాలు, మద్దిలేటి, శ్రీనివాసులు, నాగన్న పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి శ్రీమఠం పీఠాధిపతి అభినందనలు



మంత్రాలయం, జూన్ 9: మూడోసారి భారత ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నరేంద్రమోదీకి మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు అభినందనలు తెలిపారు. భారతదేశంలో మొదటి ప్రధానమంత్రిగా జవహర్‌లాల్ నెహ్రూతో సమానంగా ప్రస్తుతం ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రమాణస్వీకారం చేయడం భారతదేశం గర్వించదగ్గ విషయమన్నారు. అదేవిధంగా ప్రధానితో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన మంత్రులు ప్రమాణ స్వీకారం చేయడంతో వారిని అభినందించారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ప్రమాణస్వీకారం చేయడం సంతోషదాయకమన్నారు. దేశభద్రత, ప్రపంచ శాంతి, రాష్ట్రఅభివృద్ధికి మంత్రి వర్గం ఎనలేని కృషి చేస్తుందని తెలిపారు. రాబోయే ఐదేళ్ల పాలన విజయవంతం కావాలని, రాఘవేంద్రస్వామి ఆశీస్సులు ఉండాలని ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు తెలిపారు.

సంగమేశ్వరాన్ని సందర్శించుకున్న ట్రైనీ ఎస్పీ


సంగమేశ్వరున్ని దర్శించుకుంటున్న ట్రైనీ ఎస్పీ చిత్తరంజన్

కొత్తపల్లి, జూన్ 9: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన సప్తనది సంగమేశ్వరం ఆలయాన్ని తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా ట్రైనీ ఎస్పీ చిత్తరంజన్ ఆదివారం సందర్శించుకున్నారు. ప్రాచీన సంగమేశ్వరాలయంలోని వేపదారు శివలింగానికి కుంకుమార్చన, పుష్పార్చన, నదిజలాలతో అభిషేకాలు, మంగళ హారతి వంటి విశేష పూజాది క్రతవులు నిర్వహించారు. అనంతరం కృష్ణానది పరివాహక ప్రాంతాన్ని ప్రకృతి అందాన్ని సందర్శించారు. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ ఆయనకు ఆలయ చరిత్రను వివరించారు.

బియ్యం బస్తాల స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేస్తున్న బియ్యం బస్తాల వాహనం

మిడుతూరు, జూన్ 9: మిడుతూరు బ్రహ్మంగారి మఠం దగ్గర అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం బస్తాలు తరలిస్తున్న వాహనాన్ని పక్కా ప్లాన్ ప్రకారం మిడుతూరు పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఆత్మకూరు నుంచి మిడుతూరు మీదుగా నందికొట్కూరుకు 51 పీడీఎస్ బియ్యం బస్తాలు తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాలో కిట్టు అను వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వెలుగోడులో మోస్తరు వర్షం

వెలుగోడు, జూన్ 9: వెలుగోడు మండలంలో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచే ఆకాశంలో మేఘాలు కమ్ముకున్నాయి. మోస్తరు వర్షం పడటంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నల్లమల అటవీ ప్రాంతంలో సైతం భారీగా వర్షం కురవడంతో ఆత్మకూరు వెలుగోడు వెళ్లే రహదారిలో వర్షపు నీరు ప్రవహించి రాకపోకలకు అంతరాయంగా మారింది.

మహానందిలో ప్రముఖులు


నెల్లూరు ఆర్డీవో లవన్నను శాలువాతో సన్మానిస్తున్న ఏఈవో మధు

మహానంది, జూన్ 9: మహానంది క్షేత్రం ఆదివారం వేలాదిమంది భక్తులతో కళకళలాడింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుండి వేలాదిమంది భక్తులు పరమ శివుని దర్శనం కోసం తరలి రావడంతో ఆలయం ప్రాంగణం భక్తుల శివనామస్మరణతో మార్మోగింది. తెల్లవారుజామున నుండే భక్తులు ఆలయ ప్రాంగణంలోని కోనేర్లల్లో పుణ్య స్నానాలు ఆచరించారు. పరమశివుని దర్శనం కోసం గంటల కొద్ది క్యూలో నిల్చొని దర్శించుకున్నారు. కాగా సాయంత్రం ఒక వైపు వర్షం కురుస్తున్న అలాగే ఆలయంలోకి వెళ్లడం జరిగింది. భక్తుల రద్దీ వల్ల దేవస్థానానికి వివిధ సేవల ద్వారా రూ.లక్షలాది ఆదాయం లభించిందని ఆలయ అధికారులు తెలిపారు.

ప్రముఖుల పూజలు

మహానంది క్షేత్రంలో ఆదివారం పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరిలో నెల్లూరు ఆర్డీవో లవన్నతో పాటు తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రామరావు కుటుంబ సమేతంగా వేర్వేరుగా క్షేత్రానికి వచ్చారు. వీరికి ఆలయం ముఖ మంటపం వద్ద అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో మహానందీశ్వరునికి, కామేశ్వరీదేవి అమ్మవార్లకు కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ప్రాంగణంలోని అలంకార మంటపంలో వేదపండితులు ఆశీర్వదించారు. ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధు వీరిని శాల్వతో సన్మానించి ప్రసాదాలు అందజేసారు. వీరివెంట ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.


మహానందిలో తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రామారావును ఆశీర్వదిస్తున్న వేదపండితులు


ఉన్నత స్థాయి ఉద్యోగం వదిలి రాజకీయాల్లోకి వచ్చిన మాజీ ఐఏఎస్ అధికారి ఏఎండీ ఇంతియాజ్‌కు భంగపాటు తప్పలేదు. జగన్ ఒత్తిడితో ఏడాది సర్వీస్‌ను వదులుకొని ఉద్యోగానికి రాజీనామా (స్వచ్ఛంద పదవీ విమరణ) చేశారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ చేతిలో ఓటమి పాలయ్యారు. టీడీపీ ప్రభుత్వంలో ఆనాటి సీఎం చంద్రబాబు ఇంతియాజ్‌కు ఐఏఎస్‌గా సముచిత స్థానం కల్పించారు. జగన్ వచ్చాక ఆయనకు అనుకూలంగా మారారు. అదే జగన్‌ను నమ్ముకొని రాజకీయంగా నట్టేట మునిగిపోయారు.



అయ్యోఎస్!?

- ఉద్యోగం పోయే.. పదవి రాకపోయే
- జగన్ ఒత్తిడితో కలెక్టరు ఉద్యోగానికి ఇంతియాజ్ రాజీనామా
- కర్నూలు వైసీపీ అభ్యర్థిగా పోటీ
- సైకిల్ వేగానికి కొట్టుకుపోయిన ఐఏఎస్ అధికారి
- టీజీ భరత్ చేతిలో ఘోర పరాభవం

కర్నూలు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన హఫీజ్‌ఖాన్ టీడీపీ అభ్యర్థి టీజీ భరత్‌పై స్వల్ప ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఐదేళ్లు అధికారం ఉన్నా నియోజకవర్గం అభివృద్ధి కోసం హఫీజ్‌ఖాన్ చేసిందేమీ లేకపోగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. అదే క్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మధ్య వర్గపోరు తీవ్ర స్థాయికి చేరింది. ఓ దశలో మళ్లీ హఫీజ్‌ఖాన్‌కు టికెట్ ఇస్తే ఆయన గెలుపు కోసం పని చేసే ప్రసక్తే లేదని ఎస్వీ మోహన్‌రెడ్డి పేర్కొన్నట్లు తెలుస్తోంది. హఫీజ్‌ఖాన్ స్థానంలో ముస్లిం మైనార్టీ అభ్యర్థికే టికెట్ ఇవ్వాలని జగన్ సహా వైసీపీ అధిష్టానం నిర్ణయించి ఆ వర్గంలో అభ్యర్థి కోసం అన్వేషించారు. ఆ సమయంలో కర్నూలు సర్వజన వైద్యశాలలో పని చేస్తున్న ఆర్థోపెడిక్ డాక్టర్ ఇలియాస్ పేరు తెరపైకి వచ్చింది. ఆయన టీజీ భరత్‌ను ఢీకొట్టడం కష్టమని భావించిన వైసీపీ దివంగత డాక్టరు ఇస్మాయిల్‌కు స్వయాన అల్లుడైన ఐఏఎస్ అధికారి ఏఎండీ ఇంతియాజ్ అహ్మద్‌ను బరిలోకి దింపింది.



జగన్ ఒత్తిడితోనే ఎన్నికల బరిలోకి..!

డాక్టర్ ఇస్మాయిల్ స్వయాన అల్లుడు ఏఎండీ ఇంతియాజ్. ఆయన స్వగ్రామం కోడుమూరు. డాక్టర్ ఇస్మాయిల్ కుటుంబానికి నగరంలో మంచి పేరు ఉంది. అదే క్రమంలో ఇస్మాయిల్, టీజీ వెంకటేశ్ కుటుంబాల మధ్య మంచి స్నేహ సంబంధాలు ఉన్నాయి. నగరంలో వీరిద్దరిని రాం రహీమ్ అనే వారు. ఆ కుటుంబానికి చెందిన ఏఎండీ ఇంతియాజ్ భూపరిపాలన అదనపు ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ), సెర్ప్ సీఈవో, మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ హోదాలో పని చేస్తుండగా జగన్ రాజకీయాల్లోకి రావాలని ఒత్తిడి చేశాడు. మొదట్లో రాజకీయాలపై ఆసక్తి లేదని తిరస్కరించినా బలవంతంగా ఉద్యోగానికి స్వచ్ఛంద పదవీ విరమణ చేయించి కర్నూలు నుంచి పోటీ చేయించారు. చివరకు టీజీ భరత్ చేతిలో 18.876 ఓట్ల తేడాతో ఘోర పరాజయం పొందారు. వాస్తవంగా ఇంతియాజ్‌కు 2025 మే 31వ తేదీ వరకు సర్వీస్ ఉంది. అదే ఉద్యోగంలో ఉండి ఉంటే మరో ఏడాది సీనియర్ ఐఏఎస్ అధికారిగా రాష్ట్ర పాలనలో భాగస్వామ్యమై ఉండేవారు.

చంద్రబాబు హయాంలో సముచిత స్థానం

డిప్యూటీ కలెక్టరు నుంచి ఐఏఎస్ పదోన్నతి పొందిన తరువాత ఇంతియాజ్‌కు నాటి చంద్రబాబు ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించారు. 2018కి ముందు ఆయన నెల్లూరు, గుంటూరు జాయింట్ కలెక్టరు (జేసీ)గా పని చేశారు. ఆ తరువాత చంద్రబాబు ప్రభుత్వంలో 2019 ఫిబ్రవరి 8న కృష్ణా జిల్లా కలెక్టరుగా నియమించారు. అదే ఏడాది మేలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయింది. తరువాత వచ్చిన జగన్ ప్రభుత్వంలో కూడా కృష్ణా జిల్లా కలెక్టరుగా 2021 జూన్ వరకు కొనసాగారు. ఆ క్రమంలో జగన్‌కు దగ్గరయ్యారు. ఆ తరువాత జగన్ ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్‌గా నియమించింది. అదే శాఖ స్పెషల్ సెక్రటరీ అదనపు బాధ్యతలు ఇచ్చారు. వక్ఫ్ బోర్డు ఛైర్మన్ పదవి కూడా ఇచ్చారు. స్వచ్ఛంద పదవీ విరమణ చేసే సమయంలో కీలకమైన భూ పరిపాలన అదనపు ప్రధాన కార్యదర్శి సెర్ప్ సీఈవో, మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్, కార్యదర్శి వంటి కీలక పోస్టులో ఉన్నారు. జగన్‌ను నమ్ముకొని రాజకీయాల్లోకి వచ్చి ఉద్యోగం.. హోదా కోల్పోయారని పలువురు చర్చించుకోవడం కొసమెరుపు.

వైసీపీ వర్గాల్లో నలిగిన ఇంతియాజ్

ఇంతియాజ్ కర్నూలు జిల్లాకు చెందిన వ్యక్తే అయినా ఉద్యోగ రీత్యా ఎక్కువ కాలం బయటనే ఉన్నారు. బంధువులు తప్పా ప్రజలతో పెద్దగా ఆయనకు సంబంధాలు లేవు. ఉన్నఫలంగా ఉద్యోగం వదులుకొని రాజకీయాల్లోకి రావడంతో ఇక్కడ వైసీపీలో కీలకంగా ఉన్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డిలపైనే ఆధార పడాల్సి వచ్చింది. ఐదేళ్లుగా వారిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయిలో విభేదాలు ఉన్నాయి. ఎన్నికల వేళ వీరిద్దని సమన్వయం చేయడంలో ఇంతియాజ్ సక్సెస్ కాలేకపోయారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. పైగా రాజకీయ అనుభవం లేని ఆయన హఫీజ్ ఖాన్, ఎస్వీ వర్గాల మధ్య రాజకీయంగా నలిగిపోయారని పేర్కొంటున్నారు. హఫీజ్‌ఖాన్ వర్గం కూడా ఇంతియాజ్ గెలుపు కోసం పని చేయలేదని ఆ పార్టీ నాయకులే చెప్పడం గమనార్హం. ఎన్నికల్లో ఓట్ల కొనుగోలు, నాయకులను మచ్చిక చేసుకోవడానికి భారీగా డబ్బు వెచ్చించి ఆర్థికంగా కూడా నష్టపోయాడని నగరంలో చర్చ జరుగుతోంది.

టెన్జింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డుకు దరఖాస్తులు

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 9: భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ-2023 సంవత్సరానికిగాను టెన్జింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కర్నూలు సెట్కూరు సీఈవో పీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. గత మూడు సంవత్సరాలలో భూమి, సముద్రం, గాలిపై సాహస కార్యకలాపాలలో అత్యుత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించిన వ్యక్తులకు జీవితకాల సాఫల్యం కింద అర్జున అవార్డులు ఇస్తారని పేర్కొన్నారు. అవార్డు గ్రహీతలకు టెన్జింగ్ నార్గే కాంస్య విగ్రహంతోపాటు, ప్రశంసాపత్రం, రూ.15 లక్షల నగదు బహుమతిని అందజేస్తారని తెలిపారు. ఈ అవార్డుకు వెబ్‌సైట్ ట్ఠిఇట//ఁఠ్రీటఛీటజౌరి.జీ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆఖరు తేదీ ఈ నెల 14వ తేదీ చివరి గడువు అని వివరించారు.

నేడు సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన వార్షికోత్సవం

కొత్తపల్లి, జూన్ 9: మండలంలోని సంగమేశ్వరం సమీపంలో ఉన్న సిద్దేశ్వరం వద్ద 10వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు రాయలసీమ ప్రజల హృదయ స్పందన అలుగు ప్రజా శంకుస్థాపన 8వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సిద్దేశ్వరం వద్ద అలుగు శంకుస్థాపన జరిగి 8 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాయలసీమలోని ప్రజా సంఘాల ప్రతినిధులతో కలిసి సిద్దేశ్వరం వద్ద వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయినా రాయలసీమ హక్కుల అమలుపై పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. త్వరలో ఏర్పాటు కానున్న నూతన పాలక ప్రభుత్వమైనా రాయలసీమ ప్రాజెక్టు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమానికి వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు.

మంత్రాలయంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మంత్రాలయం, జూన్ 9: మంత్రాలయం తుంగభద్ర నది ఒడ్డున గుర్తు తెలియని భక్తుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆదివారం సాయంత్రం రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని కళ్యాణకట్ట దగ్గర తలనీలాలు సమర్పించి నదిలో స్నానాలు ఆచరించి వస్తుండగా.. మృతి చెందాడా.. మరే ఇతర కారణాల వల్ల చనిపోయాడా అన్న విషయం తెలియాల్సి ఉందని మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్ తెలిపారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని భక్తుని మృతదేహంగా కేసు నమోదు చేశామని చెప్పారు. మృతుని వయస్సు 55 నుంచి 58 ఏళ్ల మధ్య ఉంటుందని, ఎర్రటి చుక్కల అంగి, నశం కలర్ పంచ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు

అహోబిలంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ



అల్లరి మూకలు వేసిన రాళ్లు



అహోబిలంలో వైసీపీ వర్గీయుల రాళ్ల దాడిలో పగిలిన ఆటో అద్దాలు

ఆళ్లగడ్డ, జూన్ 9: ఆళ్లగడ్డ మండలంలోని అహోబిలం గ్రామంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. గ్రామంలో టీడీపీ వర్గీయుడు పుల్లయ్య ట్రాక్టరులో వెళ్తుండగా టోల్ గేట్ చెల్లించాలని వైసీపీ వర్గీయుడు డిమాండు చేశాడు. గ్రామస్థులు కూడా చెల్లించాలా అని నిలదీయడంతో పుల్లయ్యను వైసీపీ వర్గీయులు వెంబడించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే వైసీపీ వర్గీయులను అదుపులోకి తీసుకునేలోపే టీడీపీ కార్యకర్తలు పుల్లయ్య, రాంబాబు ఇళ్లపై రాళ్లతో దాడి చేశారు. అంతేకాకుండా అక్కడే ఉన్న ఆటోపై రాళ్లతో దాడి చేసి అద్దాలు పగులకొట్టారు. దీనిపై రూరల్ సీఐ హనుమంత నాయక్ మాట్లాడుతూ ఇరువర్గాలపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డ్రైవర్, కండక్టర్‌పై మందుబాబుల దాడి



డ్రైవర్ ముర్తుజావలి

మిడుతూరు, జూన్ 9: ఓర్వకల్లు నుంచి నందికొట్కూరు వైపు వస్తున్న ఆర్‌టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌పై ఆదివారం రాత్రి మందుబాబులు దాడి చేసి బస్సు అందాలు పగలగొట్టారు. పోలీసులు, ఆర్‌టీసీ డ్రైవర్ తెలిపిన వివరాలివీ.. ఓర్వకల్లు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సును చింతలపల్లి సమీపంలో ఉన్న బ్రిడ్జి దగ్గర ముగ్గురు మందుబాబులు ఆపి డ్రైవర్ ముర్తుజావలి, కండక్టర్ శేషన్నపై దాడి చేశారు. పోలీసులు ఘటనా స్థలంలో బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. మందుబాబులు పరారీలో ఉన్నారు. డ్రైవరు, కండక్టర్లు మిడుతూరు పోలీసులకు ఫిర్యాదు చేసి మిడుతూరు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు. నిందితుల వివరాల కోసం పోలీసులు విచారిస్తున్నారు.

మెడికల్ కళాశాల విద్యార్థి దుర్మరణం



తేజేశ్వర్ రెడ్డి(ఫైల్)



సంఘటనా స్థలంలో తేజేశ్వర్ మృతదేహం

కర్నూలు, జూన్ 9: నగరంలోని మెడికల్ కళాశాల సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తేజేశ్వర్ రెడ్డి (21) అనే మెడికల్ కళాశాల విద్యార్థి దుర్మరణం చెందాడు. శ్రీసత్యసాయి జిల్లా రొళ్ల మండలం పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన తేజేశ్వరరెడ్డి ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. స్థానిక రాజ్‌విహార్‌లో ఉన్న మెడికల్ కళాశాల హాస్టల్‌లో ఉంటున్నాడు. ఆదివారం ఉదయం మెడికల్ కాలేజీలోని రీడింగ్ రూమ్‌కు చదువుకునేందుకు వచ్చాడు. కొద్దిసేపు తర్వాత తిరిగి హాస్టల్‌కు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా.. వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కింద పడ్డ తేజేశ్వరరెడ్డిపై బస్సు టైరు ఎక్కడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరకుని తేజేశ్వర్ రెడ్డి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. తేజేశ్వర్ రెడ్డి తల్లిదండ్రులు వెంకటనాథప్ప, గీతాలక్ష్మిలు ప్రభుత్వ టీచర్లుగా పని చేస్తున్నారు. తేజేశ్వరరెడ్డి సోదరుడు కూడా ఇటీవలే నీట్ పరీక్ష రాసినట్లు తెలిసింది. తేజేశ్వర్ రెడ్డి మొదటి ప్రయత్నంలోనే ఆలిండియా కౌన్సెలింగ్‌లో ర్యాంకు దక్కించుకున్నాడు. చేతికొచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదన వర్ణనాతీతం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు

వైద్య విద్యార్థికి నివాళి

కర్నూలు(హాస్పిటల్): రోడ్డు ప్రమాదంలో గాయపడి దుర్మరణం చెందిన వైద్యవిద్యార్థి తేజేశ్వర్ రెడ్డి మృతి పట్ల కర్నూలు మెడికల్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.హరిచరణ్ తీవ్ర సంతాపం తెలిపారు. ఆదివారం మార్చురీ వద్ద ఉన్న వైద్య విద్యార్థి భౌతికకాయాన్ని హాస్టల్ ఇన్‌చార్జి వార్డెన్ డాక్టర్ జయరాం, డిప్యూటీ వార్డెన్ డా.సోమశేఖర్‌తో కలిసి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సందర్శించి నివాళులర్పించారు. మంచి భవిష్యత్తు ఉన్న వైద్య విద్యార్థి మృతి చెందడం ఎంతో బాధ కలిగించిందని, కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

కొంప ముంచిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు

- భూములు పోతాయని రైతులు భయపడ్డారు
- పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి



కర్నూలు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): 'ల్యాండ్ టైటిలింగ్ యాక్టు మా కొంప ముంచింది. ఈ చట్టం వద్దని ఆ రోజే మా సీఎం జగన్‌కు చెప్పాను. నా మాట విని వుంటే ఈరోజు ఈ పరిస్థితి వచ్చేది కాదు..' అని పాణ్యం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు వల్ల మా భూములు గుంజేసుకుంటారని రైతులు భయపడ్డారు. గడప గడపకు తిరిగినప్పుడు ప్రతి ఒక్కరూ మమ్మల్ని ఇదే అడిగారన్నారు. ఈ టైటిలింగ్‌యాక్టు ఇప్పుడు వద్దని మా జగన్‌కు అధికారులకు చెబితే.. పట్టించుకోలేదన్నారు. పైగా దీన్ని సమర్థించుకోవడానికి ప్రయత్నించారు. టీడీపీ నాయకులు ఈ యాక్టును బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లారని తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు వల్ల పోలింగ్‌కు పది రోజుల ముందు సీన్ రివర్స్ అయిందని వాపోయారు. ప్రచారంలో మా నాయకుల వెంట తిరిగిన రైతులు ఎక్కడ మా భూములు పోతాయోనన్న భయంతోనే టీడీపీకి ఓట్లు వేశారు. మహిళలకు తాము ఫోన్లు చేశామని, వైసీపీ వస్తే మా భూములు గుంజుకుంటారన్న భయంతోనే టీడీపీకి ఓట్లు వేశామని అంటున్నారన్నారు. తాము కొన్ని తప్పిదాలు చేయడం వల్లే ఓడిపోయామని పేర్కొన్నారు. వైసీపీ ఓటమికి ఇసుక పాలసీ కూడా ఒకటని, పట్టణాల్లో గౌండాలు, కూలీలు, ఇసుకపాలసీ వల్లే ఇబ్బందులు పడ్డారని తెలిపారు. మందుబాబులు కూడా మాకు ఓటు వేయలేదని, నాణ్యమైన మందును తక్కువ ధరలకు ఇస్తామని టీడీపీ చెబితే నమ్మారని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, రైతులకు రూ.లక్ష రుణమాఫీ హామీ ఇద్దామని జగన్‌కు చెబితే నా మాట వినలేదని తెలిపారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయని, అందువల్లనే తాము ఓటమి చెందామని కాటసాని పేర్కొన్నారు. తాము చేసిన తప్పిదాల వల్లే ఓటమి చెందామే తప్ప మమ్మల్ని ఎవరూ ఓడించలేదని మాజీ ఎమ్మెల్యే పేర్కొనడం కొసమెరుపు.

కుంటలో పడి బాలుడి మృతి

హాలహర్వి, జూన్ 9: నిట్రవట్టి గ్రామంలో మనోజ్ కుమార్(9) నీటి కుంటలో పడి మృతి చెందారని గ్రామస్థులు తెలిపారు. ఆదివారం ఊరు చివర్లో నీటి కుంట వద్దకు ఆడుకుంటూ వెళ్లాడు. కుంట వద్దకు వెళ్లగానే కాలుజారి పడిపోయాడు. ఎవరూ చూడకపోవడంతో ఆ బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లిదండ్రులు మల్లికార్జున, మీనాక్షి మూడవ సంతానం మనోజ్ కుమార్. ఆ బాలుడు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

'విజయ్‌కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి'



సీఐకి ఫిర్యాదు చేస్తున్న సీనియర్ పాత్రికేయులు చలంబాబు, మధు

నంద్యాల (నూనెపల్లె), జూన్ 9: వైసీపీ పాలనలో సమాచారశాఖ రాష్ట్ర కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన విజయ్‌కుమార్ రెడ్డి అవినీతి ఆరోపణలపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని నంద్యాలకు చెందిన సీనియర్ పాత్రికేయులు చలంబాబు, మధు డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాలలోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రాజారెడ్డికి వారు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ధనాన్ని అప్పనంగా ఖర్చు చేశారని, రూ.70 కోట్ల అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదు చేశామని చెప్పారు. వైసీపీ సోషల్ మీడియాలో ఉన్నవారికి సమాచార శాఖ నుంచి వేల రూపాయలు జీతాలు ఇవ్వడమే కాకుండా అదేశాఖలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరిట రూ.5 లక్షలు వసూలు చేశారని అన్నారు. పత్రికా ప్రకటనల్లో వ్యత్యాసం చూపి రూ.కోట్లలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అయితే టీడీపీ కూటమి ఘన విజయంతో సెలవులను రద్దు చేసుకుని విజయ్‌కమార్‌రెడ్డి సెంట్రల్ సర్వీసెస్‌కు పోయేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆయనను బదిలీ చేయకుండా నిలుపుదల చేసి విచరణ చేపట్టాలని, విదేశాలకు పారి పోకుండా పాస్‌పోర్టును సీజ్ చేయాలని కోరారు. సీనియర్ పాత్రికేయుల ఫిర్యాదు మేరకు ఎస్పీతో మాట్లాడి కేసు నమోదు చేస్తామని టూటౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు.

టీడీపీతోనే శాలివాహనుల అభివృద్ధి

రాష్ట్ర అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న తుగ్గలి నాగేంద్ర

ఎమ్మిగనూరు, జూన్ 9: శాలివాహనుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్ర అన్నారు. ఆదివారం పట్టణంలోని కుమ్మర వీధిలో తాలుకా అధ్యక్షుడు పాండురంగస్వామి ఆధ్వర్యంలో జిల్లా శాలివాహనుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గంలో టీడీపీ బలోపేతం కోసం కృషి చేసిన వారిని అగ్రవర్ణాలు పొట్టనపెట్టుకున్నాయని అన్నారు. తనను టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఫ్యాక్షన్ గొడవల నుంచి రక్షించడం వల్లే ఈ రోజు ఇక్కడ మాట్లాడగలుగుతున్నానని తెలిపారు. బడుగు, సామాజిక వర్గాలకు సేవలందించేలా ఎమ్మెల్సీ పదవి ఇచ్చి తన రాజకీయ ఎదుగుదలకు తోడ్పాటునందిస్తారని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తాను ఏ స్థాయిలో ఉన్నా శాలివాహనుల అభివృద్ధి, సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం తుగ్గలి నాగేంద్రతోపాటు సంఘం దక్షిణ భారతదేశ సంఘం అధ్యక్షులు చౌడప్పశెట్టి, పలువురు నాయకులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

తుగ్గలి నాగేంద్రకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని తీర్మానం

తుగ్గలి నాగేంద్రకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని శాలివాహన సంఘం దక్షిణ భారతదేశం అధ్యక్షుడు శివకుమార్‌చౌడప్ప శెట్టి కోరారు. తుగ్గలి నాగేంద్రకు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కమిటీ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని చంద్రబాబుకు పంపుతున్నట్లు సంఘం నాయకులు చౌడప్పశెట్టి, సోమేష్, వెంకటరాజు, రంగన్న, నాగరాజురావు, మధు, రావోజీస్వామిలు బీదర్ బాబురాజు తెలిపారు.

రామోజీరావుకు ఘన నివాళి



భాగ్యనగరంలో రామోజీరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

దొర్నిపాడు, జూన్ 9: రామోజీ గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మృతి చెందడం తీరని లోటు అని భాగ్యనగరం టీడీపీ సెక్రటరీ కొత్తపల్లి సురేంద్ర అన్నారు. ఆదివారం భాగ్యనగరం, గుండుపాపల గ్రామాల్లో రామోజీరావుకి సంతాపంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పత్రికా రంగంలో కొత్త ఒరవడికి నాంది పలికిన రామోజీరావు లేని లోటు తీర్చలేనిదని అన్నారు. కార్యక్రమంలో గుండుపాపల టీడీపీ నాయకుడు కాశీవిశ్వనాథ్‌రెడ్డి, హెరిటేజ్ ఫుడ్స్ మేనేజర్ సురేంద్ర, పుల్లయ్య నాయుడు, హర్షవర్ధన్, శివారెడ్డి, బాషా, జమాల్ బాషా, కార్తీక్, అంకిరెడ్డి, తులసీశ్వర్‌రెడ్డి ఉన్నారు.

'రాష్ట్రంలో రాక్షస పాలన అంతం'



మాట్లాడుతున్న ఆళ్లగడ్డ జనసేన పార్టీ నాయకుడు ఇరిగెల రాంపుల్లారెడ్డి

చాగలమర్రి, జూన్ 9: రాష్ట్రంలో రాక్షస పాలన అంతమై సంక్షేమ పాలన వచ్చిందని ఆళ్లగడ్డ జనసేన పార్టీ నాయకుడు ఇరిగెల రాంపుల్లారెడ్డి అన్నారు. ఆదివారం చాగలమర్రి గ్రామానికి రాగానే పీఎస్ డాబా వద్ద జనసేన పార్టీ నాయకులు ఉప్పు మాబాషా, గంగవరం సుబ్బయ్య ఆధ్వర్యంలో శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామోజీ సంస్థల అధినేత రామోజీరావు మృతి బాధాకరమని అన్నారు. ఆయన మృతి పట్ల సంతాపం ప్రకటించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పేద ప్రజల సంక్షేమం సాధ్యమవుతుందని అన్నారు. వైసీపీలో అవినీతి, అక్రమాలు పెరిగి పోవడం వల్లే ప్రజల్లో వ్యతిరేకత పెరిగి కూటమికి పట్టం కట్టారని అన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఇరిగెల సూర్యనారాయణరెడ్డి, జన్ను ప్రసాద్‌రెడ్డి, అబ్దుల్ ఖాదర్, షాహిర్, అమీర్, బాబా, టీడీపీ నాయకులు ఖాజా రసూల్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి కోసం ఆటో యాత్ర



చాగలమర్రిలో ఆటో యాత్ర చేస్తున్న అబ్దుల్ గఫార్

చాగలమర్రి, జూన్ 9: గ్రామాల్లో ప్రజలు శాంతియుతంగా జీవనం సాగించాలని కోరుతూ ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లె గ్రామానికి చెందిన అబ్దుల్‌గఫార్ ఆదివారం చాగలమర్రి గ్రామంలో ఆటోయాత్ర చేశారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో భాగంగా ఆయా పార్టీ నాయకులు శాంతియుతంగా ఉండాలని కోరుతూ ఆటోయాత్ర చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రజలు శాంతిమార్గంలో నడుస్తూ గ్రామాల అభివృద్ధిలో పాల్పంచుకోవాలని కోరుతూ ప్రచారం చేశారు.

వైభవంగా పవిత్రోత్సవం



చాగలమర్రిలో వీరాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, జూన్ 9: చాగలమర్రి వీరాంజనేయస్వామి ఆలయంలో మహిళలు సామూహికంగా జల, క్షీరాభిషేకాలు చేశారు. ఆదివారం వేద పండితుల ఆధ్వర్యంలో పవిత్రోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవానమ్మ ఆధ్వర్యంలో సామూహిక భజన కార్యక్రమాన్ని, ఆంజనేయస్వామి వ్రతాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, మహిళలు పాల్గొన్నారు.

● చాగలమర్రిలోని పెద్దమకానం వీధిలో వెలసిన పెద్దమ్మకు మహిళలు ఆదివారం బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నమకానం వీధిలోగల గంగమ్మకు మహిళలు సామూహిక ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే దీపోత్సవం చేశారు. గ్రామ దేవత చాగలమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, జూన్ 9: మండలంలోని యల్లావత్తుల, కొండమాయపల్లె, రుద్రవరం గ్రామాల్లో గ్రామ దేవతలకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ, మారెమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు చీరలు, బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ముత్తులూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారికి నైవేద్యం సమర్పించారు.

సంతాన వేణుగోపాలుడికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, జూన్ 9: రుద్రవరంలోని సంతాన వేణుగోపాలస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు నిత్యతృప్తదాస్ అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. తరలివచ్చిన భక్తులు గీతా పారాయణం చేసి స్వామిని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

కోట్లకు మంత్రి పదవి రావాలని పూజలు

డోన్, జూన్ 9: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి మంత్రి పదవి రావాలని కోరుతూ పట్టణ సమీపంలోని దత్తాత్రేయ స్వామి దేవాలయంలో డా.రామన్నదత్త ఆధ్వర్యంలో శ్రీగురుచరిత్ర పారాయణం దీక్ష చేపట్టారు. ఆదివారం దత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా అవకాశం కల్పించాలని గురుదత్త పారాయణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. 12వ తేదీ వరకు ఈ దీక్ష కొనసాగుతుందని ఆయన తెలిపారు.

'టీడీపీతోనే దళితుల సంక్షేమం'

శిరివెళ్ల, జూన్ 9: రాష్ట్రంలోని దళితుల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప అన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో శిరివెళ్లలోని ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు కొల్లి ప్రభాకర్.. నాయకులు, కార్యకర్తలతో కలిసి మేరీమాత ఆలయం వద్ద ఆదివారం 101 టెంకాయలు కొట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన గుర్రప్ప మాట్లాడుతూ రాజధాని అమరావతితో పాటు రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సీఎం చంద్రబాబు నాయుడు సమన్యాయం చేస్తారన్నారు. కార్యక్రమంలో కొల్లి పుష్పరాజు, సుధాకర్, ఆంతోని, పీ సుధాకర్, మద్దిలేటి, గోపాల్, బ్రహ్మయ్య, తిరుమల రవి, పెద్దరాజులు తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడిన పీహెచ్‌సీ భవనం

- కొత్త భవనం ప్రారంభించినా పాత భవనంలోనే విధులు
- భయాందోళనలో వైద్య సిబ్బంది
- విద్యుత్ సరఫరా లేక నిరుపయోగంగా నూతన భవనం



ఆలమూరులో నిర్మాణం చేపట్టిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం

రుద్రవరం, జూన్ 9: మండలంలోని ఆలమూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, వైద్యాధికారులు క్షణక్షణం భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు. కొత్త భవనం ప్రారంభించినా పాత పీహెచ్‌సీ భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. రూ.1,85,75000తో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం నిర్మించారు. ఈ భవనాన్ని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఏపీ జల వనరుల శాఖ సలహాదారుడు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి జనవరి 19న ప్రారంభించారు. అయితే భవనానికి ఇంత వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా లేదు. దీంతో కొత్త భవనం నిరుపయోగంగానే ఉంది. ఈ విషయంపై వైద్యాధికారి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సరఫరా లేకపోవడంతో పాత భవనంలోనే విధులు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత కాంట్రాక్టరు, ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, విద్యుత్ సరఫరా కాగానే కొత్త భవనంలో విధులు నిర్వర్తిస్తామని చెప్పారు.



పాత భవనంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది



పెచ్చులూడిపడుతున్న పైకప్పు

స్నేహం.. మధురం

45 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్యాపిలి, జూన్ 9: పదో తరగతి 1978-79 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సమావేశమయ్యారు. వివిధ ప్రాంతాల్లో, ఆయా వృత్తులలో స్థిరపడిన దాదాపు 40 మందికి పైగా పూర్వ విద్యార్థులు ఈ సమావేశానికి హాజరయ్యారు. దాదాపు 45 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో స్నేహితుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. పోటా పోటీగా ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఖాజా హుసేన్, ఇమాముద్దీన్, కమతం భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్, మాణిక్యంశెట్టి, పూజారి శ్రీనివాసులు, బైసాని మధు, గాజుల రమణ తదితరులు పాల్గొన్నారు.

సంజామల, జూన్ 9 : ప్రతి విద్యార్థికి గురువును మించిన దైవం లేదని పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు మహబూబ్ భాషా, విజయ్‌కుమార్, పీవీ కృష్ణయ్య, మధుసూదన్, రమాదేవి, బాలయ్య అన్నారు. 1994 నుంచి 1999 వరకు స్థానిక పాఠశాలలో 6నుంచి 10 వతరగతి వరకు విద్యనభ్యసించిన అప్పటి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని జరుపుకున్నారు. అనాటి గురువులు హెచ్‌ఎం హుసేన్ సాహెబ్, విరోజీరావు సర్వేశ్వరరావ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, వెంకట్రామిరెడ్డి, పుణ్యేశ్వరి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో 84 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చాగలమర్రి, జూన్ 9: చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో చదివిన 1983-84 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 40 ఏళ్ల ఆత్మీయ కలయికతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కర్నూలు, కడప, అనంతపురం, హైదరాబాదు తదితర ప్రాంతాల్లో స్థిరపడిన 50 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాల పూర్వ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నరసింహుడు, సుబ్రమణ్యం, మనోహర్‌రెడ్డి, నరసింహ, సుధాకర్, లక్ష్మణ్, రాము, ఓబులేసు, మౌలాలి, అనూరాధ, లక్ష్మణబాబు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ పట్టణంలోని అంకాళరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాలలో 1987-90 సంవత్సరాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు 34 ఏళ్ల తర్వాత ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో కలుసుకున్నారు. డిగ్రీలో అధ్యాపకులు చెప్పిన బోధనలు, అనుసరించిన విధివిధానాలను, గౌరవించిన తీరుతెన్నులను నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థులు అంత్యాక్షరి పాల్గొని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమాన్ని రంగేశ్వరరెడ్డి, రంగస్వామి, శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు.



ప్యాపిలిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు



సంజామల మండలం పేరుసోముల గ్రామంలో...



చాగలమర్రిలో పూర్వ విద్యార్థులు

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి : టీడీపీ

బేతంచెర్ల, జూన్ 9 : రాష్ట్రంలో సుపరిపాలన ప్రజా సంక్షేమం రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి అన్నారు. ఆదివారం పట్టణంలోని షేక్షావలి చౌదరి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్న వైసీపీ అరాచకాలు, దౌర్జన్యాలు, అక్రమాలతోనే పాలన సాగించారని అందుకే ఎన్నికల్లో ఘోర ఓటమిని చవిచూశారన్నారు. రాష్ట్రాన్ని అన్నివిధులుగా నాశనం చేశారన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రధానమంత్రి మోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌తోనే రాష్ట్రానికి భవిష్యత్ ఉండనుందని ధీమా వ్యక్తం చేశారు. అంతకు ముందు కార్యకర్తలు అభిమానులు భారీగా ఆయన ఇంటి వద్దకు చేరుకుని భారీ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపేంద్ర, టీడీపీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



టీడీపీ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరిని సన్మానిస్తున్న టీడీపీ కార్యకర్తలు

డోన్‌లో ఎన్డీయే కూటమి సంబరాలు

డోన్(రూరల్), జూన్ 9: దేశ ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణస్వీకారం సందర్భంగా డోన్ పాతబస్టాండులో ఎన్డీయే కూటమి నాయకులు సంబరాలు చేసుకున్నారు. కేక్‌ను కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. అనంతరం బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోదీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్, భరణి, రమేష్, హేమ సుందర్ రెడ్డి, కేసీ మద్దిలేటి, చంద్రశేఖర్, కే.నాగార్జున, అవుకు వెంకటేశ్వర్లు, దేవేంద్ర, వీరేష్, శివ దొరపల్లె, పోలా వెంకటేశ్వర్లు, ఆర్మీ రామయ్య, ఉమాజీ సందు ఆంజనేయులు, కోడి అశోక్, ఆంజనేయులు, జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ గడ్డం బ్రహ్మం, టీడీపీ నాయకులు పవన్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డోన్‌లో సంబరాలు చేసుకుంటున్న ఎన్డీయే కూటమి నాయకులు

ఘనంగా ఎస్టీయూ 78వ ఆవిర్భావ వేడుకలు



మాట్లాడుతున్న జీవీఎస్ ప్రసాదరెడ్డి

కోవెలకుంట్ల, జూన్ 9 : కోయిలకుంట్ల పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు కె.వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన ఎస్టీయూ 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అదనపు కార్యదర్శి, మాజీ ఉపాధ్యక్షులు జీవీఎస్ ప్రసాద్‌రెడ్డి, కె.వెంకట్రామిరెడ్డి హాజరయ్యారు. ఎస్టీయూ స్థాపించి నేటికి 78 సంవత్సరాలు పూర్తయినట్లు తెలిపారు. వివిధ పోరాటాలు చేస్తూ ఉపాధ్యాయులకు అండగా సంఘం నిలిచిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు టి.శ్రీనివాసులు, ఎంవీసుబ్బారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామక్రిష్ణరెడ్డి, ఓబులేసు, కెయిలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గిరీష్, రవీంద్రరెడ్డి, నాగేశ్వరయ్య, జీవీ నారాయణరెడ్డి, మనోహర్, పాండురంగారెడి పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ఆ సంఘం 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపకులకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటనాయక్, చిన్నపురెడ్డి, కిరణ్‌కుమార్, హాజీ మస్తాన్‌వలి, చంద్రమౌళి, మద్దిలేటి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

రుద్రవరం, జూన్ 9: మండలంలోని ఆర్.నాగులవరం గ్రామ సమీపంలో రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం బుక్కపురం గ్రామానికి చెందిన మనోజ్ అనే యువకుడు రుద్రవరం మండలం ఆలమూరు గ్రామానికి వెళుతుండగా ఆళ్లగడ్డ వైపు నుంచి రుద్రవరం గ్రామం వైపు వెళుతున్న మోటారు సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బుక్కాపురం గ్రామానికి చెందిన యువకుడు మనోజ్ తీవ్రంగా గాయపడ్డాడు. మరో యువకుడు రుద్రవరం గ్రామంలోని బెస్తకాలనీకి చెందిన యువకుడిగా స్థానికులు గుర్తించారు. తీవ్రంగా గాయపడ్డ మనోజ్‌ను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో చికిత్స నిమిత్తం తరలించారు.

పెన్షనర్లకు సంక్షేమ ఫలాలు అందించాలి

● డోన్ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేవీన్ భానుసింగ్



పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సన్మానిస్తున్న పెన్షనర్ల సంఘం సభ్యులు

డోన్(రూరల్), జూన్ 9: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించి వారికి సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని డోన్ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేవీన్ భానుసింగ్ కోరారు. ఆదివారం పట్టణంలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులు శివశంకరయ్య, శివప్రసాద్, గ్రేసమ్మలను పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. అనంతరం పెన్షనర్ల సంఘం సభ్యులుగా చేర్చుకున్నారు. కేవీన్ భానుసింగ్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వానికి 12న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న చంద్రబాబు నాయుడుకు పెన్షనర్ల సంఘం తరుపున శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో పెన్షనర్ల సంఘం నాయకులు మౌలాలి, గాలయ్య, గోపాల్, మాజీ యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు నరసింహుడు, రిటైర్డు ఎస్ఐ మౌలాలి, సుబ్బరాయుడు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 9 : మండలంలోని వివిధ గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు చేపడతామని కొలిమిగుండ్ల సీఐ గోపినాథ్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండలంలోని బెలుంశింగవరం, బెలుం, కొలిమిగుండ్ల, కనకాద్రిపల్లె తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. చిన్నపాటి కారణాలతో గొడవలకు పాల్పడితే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గమనించాలని సీఐ కోరారు. గొడవలకు దూరంగా ఉండాలని, శాంతియుత జీవనం కొనసాగించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఐ సూచించారు.

సంక్షేమానికి కొత్త బాటలు వేస్తాం



బీసీ రాజారెడ్డిని అభినందిస్తున్న టీడీపీ అభిమానులు

బనగానపల్లె, జూన్ 9: బనగానపల్లె ఎమ్మెల్యేగా బీసీ జనార్దన్‌రెడ్డి నాయకత్వంతో నియోజక సంక్షేమానికి కొత్త బాటలు వేస్తామని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. ఆదివారం బీసీ రాజారెడ్డికి గజమాలలు వేసి అభినందించారు. బీసీకి మంత్రి పదవి రావాలని కోరారు.

అంబాల రామకృష్ణారెడ్డికి అభినందనల వెల్లువ



మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డిని అభినందిస్తున్న టీడీపీ నాయకులు, అభిమానులు

బనగానపల్లె , జూన్ 9 : బనగానపల్లె ఎమ్మెల్యేగా బీసీ జనార్దన్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడంలో కీలక పాత్ర పోషించిన మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డిని ఆదివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు సన్మానించారు. పలుకూరు గ్రామంలో టీడీపీకి భారీ మెజార్టీ రావడానికి రామకృష్ణారెడ్డి కృషి చేశారని నాయకులు అన్నారు. అంబాల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ బీసీ జనార్దన్‌రెడ్డి గెలుపుకు సహకరించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బీసీకి మంత్రిపదవి రావాలని ఆకాంక్షించారు.

బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డితో కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి భేటీ



బనగానపల్లె , జూన్ 9 : రాష్ట్ర టీడీపీ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డిని బనగానపల్లె టీడీపీ నాయకులు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం భేటీ అయ్యారు. నంద్యాల టీడీపీ ఎంపీగా గెలుపొందిన బైరెడ్డి కుమార్తె బైరెడ్డి శబరి గెలుపొందడం పట్ల హర్షం వ్యక్తం చేసి బైరెడ్డిని కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు. కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యేగా బీసీ జనార్దన్‌రెడ్డి, నంద్యాల ఎంపీగా బైరెడ్డి శబరి గెలుపొందడం హర్షణీయమన్నారు.

బైరెడ్డిని కలిసిన టీడీపీ నాయకులు

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 9: నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి తండ్రి బైరెడ్డి రాజశేఖరరెడ్డిని కొలిమిగుండ్ల మండల టీడీపీ యువ నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. సార్వత్రిక ఎన్నికల్లో నంద్యాల పార్లమెంటు సభ్యురాలిగా డా.బైరెడ్డి శబరి భారీ మెజార్టీతో ఎన్నిక కావడం పట్ల వారు బైరెడ్డి రాజశేఖరరెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు గూడూరు శివరామిరెడ్డి, గూడూరు మహేశ్వరరెడ్డి, గంగ బాస్కర్, జగన్నాథబాబు తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటలను తలపిస్తున్న రోడ్లు



మద్దూరు ఎస్సీ కాలనీలో నిలిచిన వర్షం నీరు

చాగలమర్రి, జూన్ 9: మండలంలోని మద్దూరు గ్రామంలో రహదారులు నీటి కుంటను తలపిస్తున్నాయి. మోస్తరు వర్షానికే పలు వీధుల్లో వర్షపు నీరు నిలిచి బురద కుంటలుగా మారాయి. ఎస్సీ కాలనీలో డ్రైనేజీలు లేక రహదారిపైనే నీరు నిలిచి దుర్గంధంగా మారింది. ఆ దారిలోనే కాలనీ వాసులు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఇలాగైతే రోగాలు రావా అంటూ కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి మురుగు నీరు పోయేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రేపు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ

కోవెలకుంట్ల, జూన్ 9 : కోవెలకుంట్లలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కోవెలకుంట్ల గుళ్లదుర్తి గ్రామానికి చెందిన కవి రామాచార్యులు రచించిన నామస్మరణం మోక్షదాయకం అనే పుస్తకాన్ని రచించారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రవచనకర్త పి.రామశేషయ్య, గ్రంథ సమీక్షకులు వైవీఎస్ నారాయణరెడ్డిలు పాల్గొని ఆవిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేటి నుంచి రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు

డోన్(రూరల్), జూన్ 9: డోన్ పట్టణం కొండపేటలో వెలసిన రేణుకా ఎల్లమాంబేశ్వరి అమ్మవారి ఉత్సవాలు సోమవారం నుంచి ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఏతా నాగరాజుగౌడు అన్నారు. రేణుకా ఎల్లమ్మ ఆలయం ఉత్సవాలకు ముస్తాబు చేశారు. సోమవారం అమ్మవారికి ప్రత్యేక ఆకుపూజలు, కుంకుమార్చనలు, అభిషేక కార్యక్రమాలు జరగనున్నట్లు ధర్మకర్త తెలిపారు. అలాగే అమ్మవారికి బోనాల సమర్పణ, అఖండ దీపజ్యోతుల ప్రదర్శన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

వైసీపీ పాలనలో ప్రజలు విసిగిపోయారు



ఐవీ పక్కీర రెడ్డిని అభినందిస్తున్న టీడీపీ నాయకులు

అవుకు, జూన్ 9: వైసీపీ పాలనలో ప్రజలు విసిగిపోయి టీడీపీకి భారీ విజయాన్ని అందించారని టీడీపీ సీనియర్ నాయకుడు ఐవీ పక్కీర రెడ్డి అన్నారు. ఆదివారం టీడీపీ వాణిజ్య విభాగం నంద్యాల పార్లమెంట్ అధ్యక్షుడు టంగుటూరు శీనయ్య, టీడీపీ నాయకులు లాయర్ నాగేంద్ర, నాగరాజు, ఖాదర్, ప్రసాద్ రామాపురం గ్రామానికి చేరుకొని ఐవి పక్కీర రెడ్డికి పూలమాలలు వేసి అభినందించారు. ఈ సందర్భంగా ఐవీ పక్కీర రెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గం ఎమ్మెల్యేగా బీసీ జనార్దన్ రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందడం మంచి పరిణామం అన్నారు. వైసీపీ అరాచక పాలనలో రాష్ట్రానికి రాజధాని లేకపోవడం, నిరుద్యోగ సమస్య, భూకబ్జాలతో ప్రజలు విసిగిపోయి వైసీపీకి ప్రతిపక్ష హోదా లేకుండా చేశారన్నారు. 12న చంద్రబాబును ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధి పరుగులు పెడతాయన్నారు. టీడీపీకి భారీ మెజార్టీని అందించిన ఓటర్లకు రుణపడి ఉంటామని తెలిపారు.

వార్డులో పర్యటించిన కౌన్సిలర్

నంద్యాల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని రామలక్ష్మీకొట్టాల 20వ వార్డులోని ప్రజల సమస్యలను టీడీపీ కౌన్సిలర్ హుసేన్‌బాషా తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు అన్నారు. టీడీపీ నాయకులు రాజశేఖర్, ఏసు, బాషా తదితరులు ఉన్నారు.